## మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, జనతా న్యూస్: జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న ఎన్నికలను సమర్థవంతంగా, నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, చొప్పదండి మున్సిపాలిటీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేసి, పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత రూట్ అధికారులకు లేదా మానిటరింగ్ అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని తెలిపారు. చొప్పదండిలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండి, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి: జిల్లా ఎన్నికల అధికారి

కరీంనగర్, జనతా న్యూస్, ఫిబ్రవరి 10: జిల్లాలో ఈ నెల 11న జరగనున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఓటర్ స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి ఓటరు ఎన్నికల కమిషన్ అనుమతించిన 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు వేయవచ్చని తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతించిన గుర్తింపు కార్డుల్లో ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, ఉద్యోగ గుర్తింపు కార్డు, బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఫోటో పాస్‌బుక్, పెన్షన్ పత్రాలు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ తదితరాలు ఉన్నాయి. అదనంగా ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆయుధ లైసెన్స్, ఎంపీ--ఎమ్మెల్యే గుర్తింపు కార్డు వంటి పత్రాలు కూడా గుర్తింపుగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పోలింగ్ రోజున తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైనదని, ఓటర్లు బాధ్యతగా పాల్గొనాలని సూచించారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్, జనతా న్యూస్: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం నగరంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని కాశ్మీర్ గడ్డ, రాంనగర్, పద్మనగర్, చింతకుంట, కిసాన్ నగర్, రజ్విచమాన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద నిశిత పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఓటర్లు భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసర గుంపులు లేకుండా చూడాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే భారీగా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతివ్వండి: మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

**ఓటు హక్కు వినియోగించుకుని పట్టణాల అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి**

**సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని హామీ**

**కేంద్ర--రాష్ట్ర రాజకీయాలపై స్పందన**



హుస్నాబాద్, జనతా న్యూస్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన సాధనమని, పట్టణ ప్రాంత ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొంటూ, పట్టణాల్లో కూడా అధికంగా ఓటింగ్ నమోదు కావాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో గృహనిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధిలో ఉన్న లోటును పూరిస్తూ ప్రస్తుతం ఇళ్ల కేటాయింపులు, పథకాల అమలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని, స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర--రాష్ట్ర సంబంధాల అంశంపై స్పందిస్తూ రాష్ట్రానికి రావాల్సిన కొన్ని నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. పట్టణాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లో అధికార పార్టీకి మద్దతు అవసరమని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ గత పాలనలో అభివృద్ధి తక్కువగా జరిగిందని, ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల ద్వారా పట్టణాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రచారం కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ పార్టీలు ప్రజలను కలుస్తూ తమ కార్యక్రమాలను వివరిస్తున్నాయి. పోలింగ్ రోజున ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం "మెమోరీస్" పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను క్రమశిక్షణతో సాధన చేసి తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చదువుతో పాటు నైతిక విలువలను పాటించడం ద్వారా జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు నిరంతరం ప్రోత్సాహం అందించాలని, వారి ప్రతిభను వెలికి తీయడంలో సహకరించాలని కోరారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన వారికి ఉన్నత విద్యావకాశాలు, ఉపకార వేతనాలు లభిస్తాయని చెప్పారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా "బడిపంతులు -- గొప్ప పంతులు" నాటిక ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యాసంస్థల అధినేతను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. చదువులో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సాహం అందించిన ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు: 1300 మంది పోలీసులతో నిఘా



కరీంనగర్, జనతా న్యూస్ । ఫిబ్రవరి 10: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మొత్తం 1300 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో 900 మంది సిబ్బంది ప్రత్యేకంగా విధులు నిర్వర్తించనున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 109 పోలింగ్ లొకేషన్లలో 28 క్రిటికల్ కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 66 డివిజన్లను 33 రూట్లుగా విభజించి, ప్రతి రూట్‌కు ఒక ఎస్సై, రెండు రూట్లకు ఒక ఇన్స్పెక్టర్, నాలుగు క్లస్టర్లకు ఒక ఏసీపీ స్థాయి అధికారిని నియమించినట్లు చెప్పారు. అదనంగా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 12వ తేదీ ఉదయం 6 గంటల వరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమలులో ఉంటుందని, ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడటం నిషేధమని సీపీ తెలిపారు. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని 625 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతతో పాటు సున్నిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో అనుమతి లేకుండా ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే 189 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేయగా, 49 లైసెన్స్డ్ ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు 13 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు 23 ప్రత్యేక బృందాలు నిరంతరం పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను ఎస్ఆర్ఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, కౌంటింగ్ పూర్తయ్యే వరకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ఉల్లంఘనలు లేదా అనుమానాస్పద ఘటనలపై ప్రజలు డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లు 87126 70744, 87126 70745కు సమాచారం అందించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు.

## మాడల్ పోలింగ్ కేంద్రాలతో ఓటర్ల చైతన్యం




కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరిచే ఉద్దేశంతో ఐదు మాడల్ పోలింగ్ కేంద్రాలను వివిధ థీమ్‌లతో ప్రత్యేకంగా సుందరీకరించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. మంగళవారం ఆయన ఈ మాడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఎన్నికల కోసం సిద్ధం చేసిన మొత్తం 477 పోలింగ్ కేంద్రాల్లో ఐదు కేంద్రాలను పారిశుధ్యం, చెత్త వర్గీకరణ, ఓటర్ల అవగాహన, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పర్యాటక ప్రోత్సాహం వంటి అంశాలను ప్రతిబింబించేలా రూపొందించినట్లు తెలిపారు. ఓటర్లలో అవగాహన పెంపొందించి, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. 7వ డివిజన్ కుమార్‌వాడి ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ నం.45ను తడి--పొడి చెత్త వర్గీకరణ థీమ్‌తో, 19వ డివిజన్ రేకుర్తి లయోలా హై స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్ నం.136ను సాధారణ ఎన్నికల అవగాహన థీమ్‌తో రూపొందించారు. 44వ డివిజన్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ నం.319ను కరీంనగర్ పర్యాటక ప్రాధాన్యతను ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. 63వ డివిజన్ భాగ్యనగర్ సెంట్ ఆల్ఫెన్స్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్ నం.450ను పారిశుధ్య కార్మికుల సంక్షేమ థీమ్‌తో, 62వ డివిజన్ మంకమ్మతోట ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ నం.449ను జీరో ప్లాస్టిక్--గ్రీన్ థీమ్‌తో సుందరీకరించారు. మంకమ్మతోట మాడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న తొలి 50 మంది ఓటర్లకు పూల మొక్కలు, జూట్ సంచులను నగరపాలక సంస్థ తరఫున అందజేయనున్నట్లు తెలిపారు. మిగిలిన మాడల్ కేంద్రాల్లో కూడా తొలి 50 మంది ఓటర్లకు పూల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు స్వేచ్ఛగా, ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

